

13న సాలూరు ఐటీఐలో జాబ్‌మేళా

సాలూరు, మే 9(ఆంధ్రజ్యోతి): సాలూరులోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 13న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ట్రైనింగ్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక విలేఖర్లతో ఆయన మాట్లాడుతూ.. విశాఖ, తిరుపతి జిల్లాల్లోని పలు కంపెనీల్లో ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. అప్రంటీస్ పూర్తయిన వారు కూడా ప్లేస్‌మెంట్ కోసం రావొచ్చన్నారు. స్టయిఫండ్ రూ.15వేల వరకు ఇవ్వనున్నట్టు తెలిపారు. బయోడేటాతో పాటు ఎస్ఎస్‌సీ, ఐటీఐ, పాసుపోర్టుసైజు ఫొటో, ఆధార్, ఫోన్ నెంబరు, ఈ-మెయిల్ ఐడీతో అభ్యర్థులు సంప్రదించాలని కోరారు.

ఐదు నెలలుగా ఇవ్వట్లే!

- గిరిజనులకు అందని కందిపప్పు
- బియ్యం, పంచదారతోనే సరి..
- అవి కూడా ఆలస్యంగానే పంపిణీ
- మరోవైపు తీవ్రంగా వేధిస్తున్న సిగ్నల్ సమస్య
- ప్రతినెలా రేషన్ కార్డుదారులకు తప్పని ఇబ్బందులు


ఎండీయూ వాహనం వద్ద నిత్యావసర సరుకుల కోసం నిరీక్షిస్తున్న గిరిజనులు

సీతంపేట రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి):

సీతంపేట ఐటీడీఏ పరిధిలో రేషన్‌కార్డుదారులకు కందిపప్పు అందడం లేదు. గడిచిన ఐదు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఇదేమిటని ఎండీయూ వాహనాల ఆపరేటర్లను ప్రశ్నిస్తే సప్లయ్ నిలిపివేశారని.. తామేం చేస్తామని బదులిస్తున్నారు. మరోవైపు బియ్యం, పంచదార ఇతర సరుకులను కూడా ప్రతినెలా ఆలస్యంగా పంపిణీ చేస్తుండడం, సిగ్నల్ సమస్యలతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.


సీతంపేటలోని సివిల్ సప్లైస్ గోడౌన్

ఇదీ పరిస్థితి..

సీతంపేట, భామిని మండలాల్లోని రేషన్ కార్డుదారులకు గడిచిన ఐదు నెలలుగా కందిపప్పు సరఫరా జరగడం లేదు. బియ్యం, పంచదారను మాత్రమే అందజేస్తున్నారు. వాస్తవానికి ఆ రెండు మండలాల్లో 30వేలకు పైగా రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతి నెలా 30 టన్నుల కందిపప్పు అవసరం ఉంది. అయితే ఈ ఏడాది జనవరి నుంచి సివిల్ సప్లైస్ గోడౌన్‌కు కందిపప్పు సరఫరా నిలిచిపోయింది.

ఎండీఎం, అంగన్‌వాడీలకు సరఫరా...

సీతంపేట ఐటీడీఏ పరిధిలోని భామిని, సీతంపేట మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహించే పాఠశాలలకు మాత్రమే కందిపప్పును పూర్తిస్థాయిలో సరఫరా చేస్తున్నారు. కానీ రేషన్‌కార్డుదారులకు మాత్రం కొద్ది నెలలుగా పంపిణీ చేయడం లేదు. దీంతో గిరిజనులకు పౌష్టికాహారానికి దూరమవుతున్నారు.

దీంతో కార్డుదారులు బహిరంగ మార్కెట్‌లో రూ.102 చెల్లించి కందిపప్పును కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. గతంలో ఎండీయూ వాహనాల ద్వారా కేజీ కందిపప్పును రూ.65కు సరఫరా చేసేవారు.

ఆలస్యంగానే పంపిణీ..

ఐటీడీఏ పరిధిలోని రేషన్‌కార్డుదారులకు ప్రతి నెలా ఆలస్యంగానే నిత్యావసర సరుకుల సరఫరా జరుగుతోంది. వాస్తవంగా ప్రతి నెలా 30వ తేదీ నాటికి గోడౌన్‌కు సరుకులు చేరాల్సి ఉంది. ఇండెంట్ ప్రాప్తికి బియ్యం, పంచదార, కందిపప్పు, ఆయిల్ వంటివి సివిల్ సప్లైస్ గోడౌన్‌కు 5వ తేదీ అయితే కానీ చేరడం లేదు. దీంతో 8,9,10 తేదీల్లో రేషన్ కార్డుదారులకు ఎండీయూ వాహనాల ద్వారా నిత్యవసర సరుకులు అందిస్తున్నారు.

సిగ్నల్స్ లేక..

- సీతంపేట ఏజెన్సీ ప్రాంతంలో అధికశాతం మంది గిరిజనులు గిరిశిఖర గ్రామాల్లో నివసిస్తున్నారు. వారికి ప్రతినెలా రేషన్ అందించాలంటే ఎండీయూ వాహనాల నిర్వాహకులకు తలకుమించిన భారమవుతోంది. ఈ మేరకు ప్రతి నెలా నిర్దేశిత స్థలంలో వీరికి నిత్యవసర సరుకులను అందిస్తున్నారు. అయితే సిగ్నల్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో కార్డుదారులు థంబ్ వేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ పొందాలంటే ఎత్తయిన కొండ ప్రాంతం నుంచి కిందకు దిగి గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. తీరా సరుకులు ఒకటి ఉంటే ఒకటి లేకపోవడంతో గిరిజనులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అనుకున్న సమయానికి సివిల్ సప్లైస్ గోడౌన్‌కు సరుకులు సరఫరా జరగకపోవడంతో ఇటువంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- కొత్తగూడ పంచాయతీ పరిధి కె.జమ్మడుగూడలో గురువారం ఎండీయూ వాహనం ద్వారా సరుకుల పంపిణీ చేపట్టారు. అయితే కొండపైన సిగ్నల్ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో సరుకుల కోసం గిరిజనులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. మరోవైపు కందిపప్పు, పంచదార అందుబాటులో లేకపోవడంతో బియ్యం, ఆయిల్ తదితర సరుకులను మాత్రమే అందించారు.

సివిల్ సప్లైస్ డీటీ ఏమన్నారంటే..

'గత కొద్ది నెలలుగా సివిల్ సప్లైస్ గోడౌన్‌కు కందిపప్పు సరఫరా జరగడం లేదు. దీనికి గల కారణాలు మాకు తెలియవు. కేవలం మధ్యాహ్న భోజనం పథకం, అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే కందిపప్పు వస్తుంది. వాటిని జీసీసీ డిఆర్‌డిపోలకు సరఫరా చేస్తున్నాం.' అని సివిల్ సప్లైస్ డీటీ కె.మధుసూదనరావు తెలిపారు.


మొక్కజొన్న పంటను ధ్వంసం చేస్తున్న గజరాజులు

తోటపల్లికి తిరిగొచ్చాయ్..

గరుగుబిల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండలాన్ని గజరాజులు వీడడం లేదు. కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలోనే సంచరిస్తూ.. పంటలను ధ్వంసం చేస్తుండడంతో ప్రజలు, రైతులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా గురువారం నందివానివలసలో హల్‌చల్ చేసిన ఏనుగులు శుక్రవారం తిరిగి తోటపల్లికి చేరుకున్నాయి. గ్రామంలో మొక్కజొన్నతో పాటు పెసర, మినుము, అరటి, పామాయిల్ పంటలను నాశనం చేస్తుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. అటవీ అధికారులు, ట్రాకర్లు స్పందించి తక్షణమే ఏనుగుల గుంపును వేరే ప్రాంతానికి తరలించే చర్యలు చేపట్టాలని ఆ ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు.

జ్వరంతో గిరిజన బాలుడి మృతి

- శోకసంద్రంలో తల్లిదండ్రులు

సీతంపేట రూరల్, మే9(ఆంధ్రజ్యోతి): సీతంపేట మండలం పొల్ల పంచాయతీ పరిధి నాయకమ్మగూడ గ్రామానికి చెందిన గిరిజన బాలుడు అరిక మోహిత్(7) జ్వరంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. కొడుకు ఇలా ఆకస్మాత్తుగా మరణించడాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆడుతూ పాడుతూ ఉండే కుమారుడిని తల్చుకుని కన్నీరుమున్నీరవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నాయకమ్మగూడకు చెందిన సురేష్ ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య, ఇద్దరు కుమారులతో కలిసి సంతోషంగా జీవనం సాగిస్తున్నాడు. పెద్ద కొడుకు మోహిత్‌ను అదే గ్రామంలోని ఓ పాఠశాలలో చేర్పించాడు. ప్రస్తుతం ఆ గిరిజన విద్యార్థి రెండో తరగతి చదువుతున్నాడు. కాగా ఈ నెల నాలుగో తేదీన మోహిత్‌కు జ్వరం వచ్చింది. దీంతో సురేష్ తన కుమారుడిని దోనుబాయి పీహెచ్‌సీకి తీసుకువెళ్లాడు. వైద్యాధికారి భాను ప్రతాప్ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అయితే గురువారం మధ్యాహ్నం మోహిత్ ఉన్నట్టుండి కళ్లు తిరిగి పడిపోయాడు. దీంతో కుటుంబసభ్యులు హుటాహుటిన దోనుబాయి పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడి వైద్య సిబ్బంది సూచనల మేరకు బాలుడిని సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి.. అప్పటికే మోహిత్ మృతి చెందాడని తెలిపారు.

నెలాఖరుకు గృహ నిర్మాణ

లక్ష్యాలు పూర్తికావాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ శోభిక



పార్వతీపురం, మే9 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ లక్ష్యాలు ఈ నెలాఖరుకు పూర్తికావాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. వివిధ శాఖల పనుల ప్రగతిపై చర్చించారు. జిల్లాలో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. అదనపు ఆర్థిక సాయం పొందిన లబ్ధిదారులు ఆశించిన స్థాయిలో పనులు జరపడం లేదని తెలిపారు. అటువంటి వాటివారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఇంకా 3,098 జన్‌మన్ గృహ నిర్మాణాలు ప్రారంభం కాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 11,450 పంట గుంతలు లక్ష్యంగా నిర్దేశించినట్లు వెల్లడించారు. అయితే ఇప్పటికే 9,087 మంజూరు చేయగా 2,900 పూర్తయ్యాయన్నారు. ప్రతి మండలంలో కనీసం ఐదు చెరువులను అమృత్ సరోవర్ కింద గుర్తించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ పి.ధర్మచంద్రారెడ్డి, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

వేతనదారులకు అండగా..

- 'ఉపాధి' కూలీలకు బీమా
- జాబ్‌కార్డుదారులందరూ అర్హులే..
- పీఎం సురక్ష, జీవన జ్యోతి యోజనలతో భరోసా


ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

పార్వతీపురం, మే9(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు అండగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం బీమా పథకాలను అందుబాటులోకి తెచ్చింది. వాటిద్వారా వేతనదారులకు భరోసా కల్పించనుంది. పనుల ప్రదేశంలో ప్రమాదాల బారిన పడినా.. మరణించినా.. వైకల్యం పొందినా బాధిత కుటుంబ సభ్యులకు బీమా మొత్తం చెల్లించి ఆదుకోనుంది. ఉపాధి పనులకు వెళ్లిన వారు ఏదైనా కారణంతో మృతి చెందితే ఇప్పటి వరకు రూ.50వేలు మాత్రమే అందిస్తున్నారు. ఇకపై రూ. రెండు లక్షల వరకు అందించనున్నారు. కాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధి కూలీలకు బీమా సౌకర్యం కల్పించే చర్యలను అధికారులు వేగవంతం చేశారు.

బీమా అమలు ఇలా..

- ఉపాధి వేతనదారులు పనులు చేపట్టే సమయంలో మృతి చెందినా లేదా ఏదైనా ప్రమాదంలో వైకల్యం పొందినా బీమా కింద కొంత మొత్తం చెల్లిస్తారు. పీఎం సురక్ష యోజన , జీవనజ్యోతి యోజన బీమా పథకాల ద్వారా వేతనదారుల కుటుంబాలకు భరోసా కల్పిస్తారు.

జిల్లాలో 1.94 లక్షల మేర జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 1.90 లక్షల కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. 1.33 లక్షల మంది ఉపాధి పనులకు వెళ్తున్నారు. వారందరికీ బీమా పథకాలు వర్తింపజేయనున్నారు.

- సురక్ష యోజన కింద 18 నుంచి 70 సంవత్సరాలు వయసు కలిగిన వేతనదారులు ఏడాదికి రూ.20 ప్రీమియం చెల్లించాలి. జాబ్ కార్డులో నమోదైన వారందరికీ ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకంలో నమోదైన వేతనదారులు మృతి చెందినా లేదా శాశ్వత వైకల్యం ఏర్పడినా రూ. రెండు లక్షలు చెల్లిస్తారు. పాక్షిక వైకల్యం పొందిన వారికి రూ.లక్ష బీమా కింద అందుతుంది.
- జీవన జ్యోతి యోజన కింద 50 సంవత్సరాల లోపు వేతనదారులు బీమా పొందొచ్చు. ఇందుకోసం వేతనదారుడు ఏడాదికి రూ.436 చెల్లించాల్సి ఉంటుంది. జాబ్‌కార్డు పేరు ఉన్న వారికే ఇది వర్తిస్తుంది. సహజ మరణమైనా, పాక్షిక వైకల్యమైనా, ప్రమాదవశాత్తూ మరణించినా బాధిత కుటుంబానికి రూ.రెండు లక్షలు అందిస్తారు. కూలీల బ్యాంకు ఖాతాల నుంచి ఏటా ప్రీమియం మొత్తం వసూలు చేస్తారు. 'ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఉపాధి కూలీలందరికీ బీమా పథకాలు వర్తించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. కష్ట కాలంలో వేతనదారుల కుటుంబాలకు అవి ఎంతగానో దోహదపడతాయి.' అని డ్వామా పీడీ రామచంద్రరావు తెలిపారు.

ఉన్నతి ఎప్పుడు?

- రుణాల కోసం ఎస్సీ, ఎస్టీ మహిళా సంఘాల ఎదురుచూపు
- నిధుల కేటాయింపు పెంచాలని విన్నపం



జియ్యమ్మవలస, మే 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ మహిళా సంఘాలు ఉన్నతి రుణాల కోసం ఎదురుచూస్తున్నాయి. ఏటా ఏప్రిల్ నెలలో ఉన్నతి పథకాన్ని రెన్యూవల్ చేస్తూ నిధులు విడుదల చేస్తుంటారు. కానీ ఈ ఏడాది ఇంకా విడుదల చేయలేదు. దీంతో ఎస్సీ, ఎస్టీ మహిళా సంఘాల సభ్యులు వాటి కోసం నిరీక్షిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ మహిళా సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలు అందించి.. తద్వారా వారి జీవనోపాధి మెరుగుపర్చడమే ఉన్నతి పథకం ప్రధాన లక్ష్యం. కాగా జిల్లాలోని 15 మండలాల పరిధిలో 565 వరకు గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. మొత్తం 19,846 మహిళా సంఘాల్లో 2,25,976 మంది సభ్యులు ఉన్నారు. వాటిల్లో 2,298 ఎస్సీ సంఘాల్లో 29,038 మంది సభ్యులు, 4,756 ఎస్టీ మహిళా సంఘాల్లో 64,799 మంది సభ్యులు ఉన్నారు. అత్యధికంగా వీరఘట్టం మండలంలోని 46గ్రామైక్య సంఘాలు ఉండగా 1,756 మహిళా సంఘాలు, అందులో 18,960 మంది సభ్యులున్నారు. అతి తక్కువగా గుమ్మలక్ష్మీపురంలో 31 గ్రామైక్య సంఘాలు , వాటి పరిధిలో 1,046 మహిళా సంఘాలు, అందులో 12,291 సభ్యులు ఉన్నారు.

ప్రతిపాదనలు ఇలా..

ఉన్నతి పథకం 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఇప్పటికే డీఆర్‌డీఏ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఒక్కో మహిళకు రూ. 50 వేలు చొప్పున అందించేందుకు రంగం సిద్ధం చేశారు. షెడ్యూల్డ్ కులాల సబ్‌ప్లాన్ (ఎస్‌సీఎస్‌పీ) మండలాల్లో 441 మంది కోసం రూ. 2.20 కోట్లతో , ట్రైబల్ సబ్‌ప్లాన్ (టీఎస్పీ) మండలాల్లో ఉన్న 744 మంది గిరిజన మహిళలకు రూ.3.72 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. అయితే ఇది చాలదని కొందరు మహిళా సంఘాల సభ్యులు అంటున్నారు. మరిన్ని నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు. గతంలో రూ. 50 వేలు తీసుకొని రుణం తీర్చేసిన వారు రూ.లక్ష ఇవ్వాలంటున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతి పథకం త్వరగా నిధులు విడుదల చేయాలని వేడుకుంటున్నారు.

త్వరలో విడుదలవుతాయి

ఎస్సీ, ఎస్టీ మహిళా సంఘాల ఉన్నతిని దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం. త్వరలోనే నిధులు విడుదలవుతాయి. మండలాల వారీగా పంపిణీ చేస్తాం.

- సుధారాణి, డీఆర్‌డీఏ పీడీ, పార్వతీపురం మన్యం

ఐదు వేల ఎకరాల్లో

కొబ్బరి మొక్కల పెంపకం

- ఉపాధి, వెలుగు సమన్వయంతో నాటేందుకు ప్రణాళికలు


సుంకిలో మొక్కలు నాటేందుకు చెరువు గట్టును సిద్ధం చేసిన దృశ్యం

గరుగుబిల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ నిధులతో జిల్లాలోని ఐదు వేల ఎకరాల్లో కొబ్బరి మొక్కలు పెంపకానికి సన్నాహాలు చేస్తున్నారు. గతంలో రహదారులకు ఆనుకుని కొబ్బరి మొక్కలు నాటారు. పర్యవేక్షణ లోపంతో అంతంత మాత్రంగానే వాటిని ఏర్పాటు చేశారు. అయితే ఈ సారి ఉపాధి, వెలుగు అధికారులు పకడ్బందీగా మొక్కలు నాటేందుకు సిద్ధమవుతున్నారు. 15 మండలాల పరిధిలోని 450 పంచాయతీల్లో చెరువులు, రిజర్వాయర్ల ప్రాంతాలు, ప్రభుత్వ భూములు (ఖాళీగా ఉన్నవి), పాఠశాలల ఆవరణల్లో నాటేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. చెరువు ప్రాంతాల్లో ఐదు మీటర్లకు ఒక మొక్కను ఏర్పాటు చేసే విధంగా మండలాలవారీగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. మండలానికి సంబంధించి సుమారు ఐదు వేలకు పైగా కొబ్బరి మొక్కల అవసరం ఉంటుందని అంచనాలు వేస్తున్నారు. మొక్కలకు సంబంధించి ఉపాధి నిధులు వెచ్చించనున్నారు. మొక్కల కొనుగోలు, గోతులు తవ్వడంతో పాటు పలు రకాల పనుల బాధ్యత ఉపాధి సిబ్బందికి అప్పగించారు. నాటిన మొక్కల పర్యవేక్షణ బాధ్యతను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పరిధిలోని

(మిగతా 8వ పేజీలో...)

8లో

ఎస్‌జీటీ అభ్యర్థులకు

ఆన్‌లైన్ శిక్షణ

- దరఖాస్తుల ఆహ్వానం
- జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిత అధికారి అప్పన్న

గిరిజన ప్రాంతాల

అభివృద్ధే లక్ష్యం

- మంత్రి సంధ్యారాణి
- రూ.156 కోట్లతో చేపట్టిన పనుల పూర్తికి చర్యలు

నేటి నుంచి

పాల ధర పెంపు

- లీటర్‌కు రూ.2 పెంచిన విశాఖ డెయిరీ
- వినియోగదారులపై రోజుకు రూ.10 లక్షల భారం

7లో



శ్మశానవాటికపై అక్రమార్కుల కన్ను

భోగాపురం, మే9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజాపులోవ శ్మశానవాటికపై అక్రమార్కులు కన్నేశారు. ఇప్పటికే శ్మశానవాటికలో కొంత విస్తీర్ణాన్ని చదును చేశారు. నిర్మాణ సామగ్రిని సైతం అక్కడకు చేర్చేశారు. మండలంలో అంతర్జాతీయ విమానాశ్రయాం ఏర్పాటు అవుతుండటంతో ఈ ప్రాంతంలో గజం స్థలం సుమారు వేలల్లో ధర పలుకుతోంది. దాంతో అక్రమార్కులు ఎక్కడ ఖాళీ స్థలం కనబడినా వదలడంలేదు. రాజాపులోవ విశాఖ సిటీకి దగ్గరలో ఉంటుంది. కొద్ది దూరంలో పరిశ్రమలు కూడా ఉన్నాయి. దాంతో ఇక్కడ భూముల ధరలు అధికంగానే ఉన్నాయి. చాలామంది నివాసం ఉండేందుకు చిన్న గదుల కోసం ఈ ప్రాంతంలో వెతుకుతుంటారు. పెద్దమొత్తంలో అద్దెలు ఇచ్చేందుకూ వెనకాడరు. దాన్ని ఆసరాగా చేసుకుని స్థానిక నాయకుల అండతో ఖాళీ స్థలాలను పలువురు ఆక్రమించేసి తొలుత చిన్న పాకలు, ఆ తర్వాత వాటిని రేకులు షెడ్డులుగా చేసి అద్దెలకు ఇస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి శ్మశానవాటికను కాపాడాలని స్థానికులు కోరారు. ఈ విషయమై డీటీ పి.హరి వివరణ కోరగా ఆక్రమణలు వీఆర్వో తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. శ్మశానవాటికలో ఆక్రమణలను నిలువరించే చర్యలు చేపడతామన్నారు.



స్థలాన్ని చదును చేసిన అక్రమార్కులు

నేటి నుంచి పాల ధర పెంపు

- లీటర్‌కు రూ.2 పెంచిన విశాఖ డెయిరీ
- వినియోగదారులపై రోజుకు రూ.10 లక్షల భారం

విశాఖపట్నం, మే 9 (ఆంధ్రజ్యోతి): పాల వినియోగదారులపై మరింత భారం మోపేందుకు విశాఖ డెయిరీ యాజమాన్యం నిర్ణయించింది. శనివారం నుంచి పాల ధరను లీటరుకు రెండు రూపాయలు, పెరుగు ధరను కేజీకి రెండు రూపాయలు పెంచుతున్నట్టు ప్రకటించింది. నూతన ధరల ప్రకారం హోమోజినైజ్డ్ డబుల్ టోన్డు పాలు 500 ఎంఎల్ (అర లీటరు) ప్రస్తుతం రూ.25 ఉండగా, రూ.26కు పెంచింది. లీటరు రూ.50 నుంచి రూ.52 చేసింది. హోమోజినైజ్డ్ టోన్డు పాలు అరలీటరు రూ.27 నుంచి రూ.28కు, లీటరు ప్యాకెట్ రూ.54 నుంచి రూ.56కు, టోన్డు పాలు అరలీటరు రూ.27 నుంచి రూ.28కు, స్టాండర్డైజ్డ్ పాలు అర లీటరు రూ.30 నుంచి రూ.31కు ఫుల్ క్రీమ్ పాలు లీటరు రూ.63 నుంచి రూ.66కు, హోమోజినైజ్డ్ టోన్డు పాలు (గంగ) అరలీటరు రూ.28 నుంచి రూ.29కు, డబుల్ టోన్డు పాలు (గంగ) రూ.26 నుంచి రూ.27కు పెంచింది. కాగా టోన్డు పెరుగు 180 గ్రాముల ప్యాకెట్ రూ.14 నుంచి రూ.15కు, 900 గ్రాముల ప్యాకెట్ రూ.54 నుంచి రూ.56కు, కేజీ ప్యాకెట్ రూ.64 నుంచి రూ.66కు పెంచారు. పెరిగిన ధరలు శనివారం నుంచి అమల్లోకి రానున్నాయి. విశాఖ డెయిరీ ప్రతి రోజు సుమారు 5 లక్షల లీటర్ల పాలను విక్రయిస్తుండడంతో డెయిరీ పరిధిలోని ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని వినియోగదారులపై రోజుకు సుమారు రూ.10 లక్షల మేర అధిక భారం పడుతుందని అంచనా వేస్తున్నారు. కాగా 2023 మార్చి 16న పాల ధరను పెంచిన విశాఖ డెయిరీ యాజమాన్యం రెండేళ్లకే మరోసారి ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

అన్ని శాఖల సమన్వయంతో అభివృద్ధి

- మున్సిపల్ ఆర్‌డీ రవీంద్ర



మాట్లాడుతున్న మున్సిపల్ ఆర్‌డీ

విజయనగరం రింగురోడ్డు, మే 9 (ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల సమన్వయంతో నగర పాలక సంస్థ మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ వి.రవీంద్ర అన్నారు. శుక్రవారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆయన వివిధ విభాగాధిపతులు, సిబ్బందితో వేర్వేరుగా సమీక్ష నిర్వహించారు. ప్రగతి నివేదికలు పరిశీలించి వాటి ఆధారంగా పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో కమిషనర్ పి.నల్లనయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఘోషా సుపత్రిలోని అన్నా క్యాంటీన్‌ను కమిషనర్ నల్లనయ్యతో కలిసి పరిశీలించారు. క్యాంటీన్‌కు సరైన షెడ్డు లేకపోవడంతో అక్కడ ఎండలో ఉండడాన్ని గమనించి తక్షణమే షెడ్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే షెడ్డు నిర్మాణానికి అవసరమైన టెండర్ల ప్రక్రియ నిర్వహించామని, త్వరలోనే షెడ్డు నిర్మాణం పూర్తవుతుందని కమిషనర్ నల్లనయ్య తెలిపారు. కార్యక్రమంలో ఏఈ సూరినాయుడు సిబ్బంది పాల్గొన్నారు.

అసమాన సేవలకు సెల్యూట్

చీపురుపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): సింధూర్ ఆపరేషన్‌లో అసమాన సేవలందిస్తున్న త్రివిధ దళాల అధిపతులకు ప్రతి భారత పౌరుడు సెల్యూట్ చేయాలని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇండియన్ ఆర్మీ వేషధారణతో మాట్లాడారు. అమాయకులు, సాధారణ పౌరుల ప్రాణాలకు ఎటువంటి ప్రమాదం లేకుండా ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేయడం మన రక్షణ దళాల సామర్థ్యానికి నిదర్శనమన్నారు. అసామాన్య ప్రతిభను ప్రదర్శించిన ప్రధాని మోదీకి, ఆయన నాయకత్వానికి దేశమంతా మద్దతు పలుకుతోందన్నారు. ఇదే స్ఫూర్తితో మన బలగాలు ముందుకు సాగాలని, పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం చెప్పాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కలిశెట్టి సత్యనారాయణ, దన్నాన స్వామినాయుడు, జనసేన నాయకుడు విసినిగిరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సైనిక దుస్తులతో సెల్యూట్ చేస్తున్న గద్దే

రక్షణ దళాలకు మంత్రి సెల్యూట్



వినతులను స్వీకరిస్తున్న మంత్రి శ్రీనివాస్

గంట్యాడ, మే 9 (ఆంధ్రజ్యోతి) దేశం గర్వపడేలా రక్షణ దళాలు పనిచేస్తున్నాయని, వారికి ప్రజల తరఫున మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సెల్యూట్ చేశారు. శుక్రవారం గంట్యాడలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యకర్తలు, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. దేశ సరిహద్దులో జరుగుతున్న పరిస్థితులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దేశంలోని 260 జిల్లాల్లో నిర్వహించే మాక్ డ్రిల్‌పై ప్రజలకు అవగాహన అవసరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సూచనలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్ నాయుడు, టీడీపీ నాయకులు అల్లు విజయకుమార్, రంధి చినరామునాయుడు తదితరులు ఉన్నారు. ●మండలంలోని పెంట్రశ్రీరాంపురంలో శనివారం నుంచి 12 వరకూ నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల వాల్ పోస్టర్‌ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ నాయకులు ఉన్నారు.

మేటి రాజధానిగా అమరావతి: కళా



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా

చీపురుపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): అమరావతి ప్రపంచ స్థాయిలో మేటి రాజధానిగా తయారు కాబోతుందని, దానికి తగిన ప్రణాళికలు ముఖ్యమంత్రి చంద్రబాబు రచిస్తున్నారని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా తగిన సహకారం అందిస్తోందన్నారు. చీపురుపల్లిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి పునర్నిర్మాణ పనులకు ప్రధాని శంకుస్థాపన చేశారన్నారు. అందుకు తగ్గట్టు నిధులు కూడా విడుదల చేశారన్నారు. గత ఐదేళ్ల పాలనలో జగన్మోహనరెడ్డి అమరావతిని సర్వనాశనం చేశారని ఆరోపించారు. ఇప్పుడు కూడా అభివృద్ధిని చూడలేక అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా వాస్తవాన్ని గ్రహించి బాధ్యత గల రాజకీయ పార్టీగా అమరావతి అభివృద్ధికి సహకరించాలని కళా కోరారు. రాష్ట్ర రాజధాని అభివృద్ధి చెందితే, లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయన్నారు. వేలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. అనంతరం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, బలరాం తదితరులున్నారు.

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

గరివిడి, మే 9(ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి వారి శ్రేయస్సు కోసమే రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. మండలంలో దేవాడ, దుమ్మెద తోటపల్లి కాలువలో పూడికలు, జంగిల్ క్లియరెన్స్ పనులను ఆయన శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళావెంకటరావు మాట్లాడుతూ కాలువల్లో పూడికలను తీయడం వలన రైతులకు వ్యవసాయానికి సంబంధించిన సాగునీరు పుష్కలంగా లభిస్తుందన్నారు. అలాగే ఇప్పటికే రైతులు వ్యవసాయం చేయడానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పనిముట్లను ప్రభుత్వం రాయితీపై సరఫరా చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పైల బలరాం, సారిపాక సురేష్‌కుమార్, దన్నాన రామ చంద్రుడు, కోనూరు పీఏసీఎస్ అధ్యక్షుడు వెంపడాపు రమణమూర్తి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి హామీ



అర్జీని స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, మే9(ఆంధ్రజ్యోతి): స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే లోకం నాగమాధవి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని సమస్యలు సంబంధిత అధికారులకు పంపించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి బి.శ్రీధర్, మండల కో-ఆర్డినేటర్లు పల్లంట్ల జగదీశ్, పల్లా రాంబాబు పాల్గొన్నారు.

ప్రతీ పౌరుడు అండగా నిలవాలి



సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే

జామి, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్‌కు ప్రతీ భారత పౌరుడు అండగా నిలవాలని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్మించిన సమావేశ మందిరాన్ని వారు ప్రారంభించారు. ఎంపీపీ అరుణ, జడ్పీటీసీ సభ్యురాలు సరయు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాక్‌పై యుద్ధానికి అంతా సహకరిస్తామని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఎంపీడీవో నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీలక్ష్మి, మండల పార్టీ కార్యదర్శి వర్రి రమణ, తహసీల్దార్ శ్రీభరత్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబానికి చేయూత



చెక్కును అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి చికిత్స పొందుతూ ఇటీవల కొత్తవలస కానిస్టేబుల్ బి.రామకోటి మృతి చెందిన నేపథ్యంలో ఆయన సతీమణి రమకు చేయూత కింద రూ.1.48 లక్షల చెక్కును ఎస్పీ వకుల్ జిందాల్ అందజేశారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు. పోలీసు శాఖలో పనిచేస్తూ ప్రమాదవశాత్తుత గానీ అనారోగ్యంతో గానీ మృతి చెందిన పోలీసు కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది కొంత మొత్తాన్ని పోగుచేసి చేయూతగా అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీపీవో ఏవో శ్రీనివాసరావు, కార్యాలయ సూపరింటెండెంట్ రామకృష్ణ, ఆర్ఎస్ఐ వరప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

విజయనగరం క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్టు ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించారు. సిబ్బంది నుంచి ఆయన వినతులు స్వీకరించారు. వినతుల పూర్వపరాలను పరిశీలించి చర్యలు చేపడతామని ఎస్పీ చెప్పారు.

రాజాంను మోడల్ నియోజకవర్గంగా చేస్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, మే 9 (ఆంధ్రజ్యోతి): రాజాంను ఐదేళ్లలో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. రోడ్లు, కాలువలు, వీధిలైట్లు, రెవెన్యూ సమస్యలపై దాదాపు 50 వినతులను ఆయన స్వీకరించారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కార్యకర్తే అధినేత కార్యక్రమాన్ని నిర్వహించి కార్యకర్తల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉగ్రమూకలను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు కేంద్రం గట్టిగా బదులిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఏ నిర్ణయానికైనా దేశ ప్రజలందరం సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు నంది సూర్యప్రకాశరావు, గురవాన నారాయణరావు, కిమిడి అశోక్‌కుమార్, లచ్చుభుక్త కృష్ణమూర్తి, గట్టి రఘు, దుప్పలపూడి శ్రీనివాసరావు, వల్లూరి గణేష్ తదితరులున్నారు.

'సంస్థాగత' ప్రక్రియను వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి రెండేళ్లకు ఒకసారి నిర్వహించే సంస్థాగత ఎన్నికల ప్రక్రియను నియోజకవర్గంలో వేగవంతం చేయాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సూచించారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో టీడీపీ నగర అధ్యక్షుడు ప్రసాదుల ప్రసాద్ అధ్యక్షతన నియోజకవర్గ పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ నగర అధ్యక్షుడు ప్రసాదుల ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో డివిజన్, గ్రామ కమిటీలు, అనుబంధ సంఘాలు, బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, కుటుంబ సాధికార సారథులు వంటివి నిర్దేశించిన సమయంలోగా పార్టీ కార్యాలయానికి అందజేయాలన్నారు. అనంతరం నగర కమిటీ, అనుబంధ సంఘాల కమిటీల నియామకం జరుగుతుందన్నారు. ఈప్రక్రియకు క్షేత్రస్థాయి నుంచి నగర పార్టీనాయకులు వరకూ అందరూ సహకరించాలని కోరారు. విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట వున్న ఎన్టీఆర్ విగ్రహం, విగ్రహం చుట్టూ రైలింగ్ పాడైన నేపథ్యంలో కొత్త వాటిని ఏర్పాటు చేసేందుకు నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 19న జరుగుతుందన్నారు. అలాగే కొత్తరేషన్‌కార్డులు, మార్పులు, చేర్పుల ప్రక్రియ ప్రారంభమైందని, పార్టీ శ్రేణులు నియోజకవర్గ ప్రజలను ఈ విషయంలో చైతన్యవంతులను చేయాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, కర్రోతు నర్సింగరావు, కంది మురళీనాయుడు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, విజ్జపు ప్రసాద్, పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్

విజయనగరం రూరల్: పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఆమె వినతులు స్వీకరించారు. విజయనగరం జిల్లా ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్స్, గ్రామీణ వైద్యులసంఘం ప్రతినిధులు ఆమెకు వినతులను సమర్పించారు. గ్రామీణ వైద్యులకు గుర్తింపునకు గతంలో జారీ చేసిన 465 జీవో పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని కోరారు.

అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్తా..



వినతులను పరిశీలిస్తున్న బంగార్రాజు

భోగాపురం, మే9 (ఆంధ్రజ్యోతి): తన దృష్టికి వచ్చిన అన్ని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. మండలంలోని పోలిపల్లిలో శుక్రవారం కార్యకర్తే అధినేత కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మహంతి శంకర్రావు, మత్స్యకార సాధికార సమితి కన్వీనర్ మైలపల్లి సింహాచలం పాల్గొన్నారు.

సాంకేతిక లోపం.. నిలిచిన రిజిస్ట్రేషన్లు

గజపతినగరం, మే 9 (ఆంధ్రజ్యోతి): గజపతి నగరంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండు రోజులుగా భూముల రిజిస్ట్రేషన్లు జరగడంలేదు. సర్వర్లు మొరాయింపుతో భూ క్రయ, విక్రయదారులు పడిగాపులు కాస్తున్నారు. గురువారం మధ్యాహ్నం నుంచి ఇంటర్నెట్‌కు అను సంధానమైన సెట్రిక్ అనే పరికరంలో సాంకేతిక లోపం తలెత్తింది. దాంతో శుక్రవారం కూడా రిజిస్ట్రేషన్లు చేపట్టే అవకాశం లేకపోయింది. ఏప్రిల్ నుంచి భూముల రిజిస్ట్రేషన్‌కు స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. అందుకు అనుగుణంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు 37 రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. గజపతినగరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో 8 మండలాలు 109 గ్రామాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లకు వస్తుంటారు. కానీ ఇక్కడ సర్వర్లు మొరాయించడంతో ముందుగా స్లాట్ బుక్ చేసుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. స్లాట్ బుక్ చేసుకున్న రోజున రిజిస్ట్రేషన్లు జరగకపోతే ఆ తర్వాత రోజుల్లో జరిగే అవకాశం ఉంటుందా.. లేదా అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో వచ్చే సోమవారం నాటికి అయినా రిజిస్ట్రేషన్లు జరుగుతాయన్న భరోసా లేకుండా పోయిందని పలువురు వాపోతున్నారు. ●ఈ విషయమై సబ్ రిజిస్ట్రార్ తవిటయ్యను వివరణ కోరగా సాంకేతిక లోపం తలెత్తడంతో సర్వర్ పనిచేయడం లేదు. టెక్నీషియన్ వచ్చి సెట్రిక్ పరికరాన్ని తీసుకు వెళ్లారు. సోమవారం నాటికి సరిచేస్తే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ యథావిధిగా జరుగుతుందని తెలిపారు.



గజపతినగరంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

షాపింగ్ మాల్‌లో అగ్నిప్రమాదం

- పరుగులు తీసిన జనం ●తప్పిన పెనుముప్పు
- రెండు ఫైరింజన్లతో మంటలు అదుపులోకి..



అగ్ని ప్రమాదం సంభవించిన షాపింగ్ మాల్

విజయనగరం, మే 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో గల ఫోర్ట్‌సిటీ షాపింగ్ మాల్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించింది. రాత్రి సుమారు 9 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో మాల్‌లో ఉన్న జనం ఒక్కసారిగా పరుగులు తీశారు. చిన్నారులు ఎక్కువగా ఉండే గేమ్‌జోన్, రెస్టారెంట్ సీలింగ్‌ల నుంచి దట్టమైన పొగలు రావటంతో ఏం జరుగుతుందోనని బెంబేలెత్తిపోయారు. విషయం గుర్తించే సరికే ఫ్లోర్‌లో దట్టంగా పొగలు కమ్ముకున్నాయి. దీంతో చిన్నారులను ఎత్తుకుని తల్లిదండ్రులు పరుగులు తీశారు. అలాగే షాపింగ్ కాంప్లెక్స్‌లో బంగారం, బ్రాండెడ్ దుస్తుల షాపులు ఉన్నాయి. వీటితో పాటు మాల్‌లో 4 థియేటర్లు కూడా ఉన్నాయి. ప్రమాదం జరిగిన సమయంలో సినిమాలు విడిచి పెట్టారు. లేకుంటే సినిమాహాల్స్‌లో తొక్కిసలాటతో ప్రాణనష్టం జరిగి ఉండేది. విషయం తెలుసుకున్న ఫైర్ అధికారులు హుటాహుటిన షాపింగ్ మాల్ వద్దకు చేరుకుని అద్దాలు పగులగొట్టి ఫైర్ ఫైటర్స్ మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదంలో ఎంత వరకు ఆస్తి నష్టం జరిగిందనే దానిపై ఎలాంటి సమాచారం లేదు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి రాంప్రకాశ్ తన బృందంతో సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ప్రమాదాన్ని నివారించటానికి 2 ఫైర్ ఇంజన్‌లు, సుమారు 20 మంది ఫైర్ ఫైటర్స్, మాల్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బొబ్బిలి రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి రైల్వే ఫ్లైఓవర్ వద్ద ఈ నెల 4వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పువ్వల వంశీ(30) విజయనగరం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొని ముగ్గురు గాయపడగా వారిలో గున్నతోటవలస గ్రామానికి చెందిన వంశీకి తీవ్ర గాయాలయ్యాయి. అతని మృతితో కుటుంబ సభ్యులు తండ్రి పువ్వల శ్రీనివాసరావు, లక్ష్మిలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

చీపురుపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.ములగాం గ్రామానికి చెందిన కరిమజ్జి శ్రీను తనపై దాడి చేశాడని అదే గ్రామానికి చెందిన పిసిని అప్పలనాయుడు శుక్రవారం చీపురుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో రచ్చబండపై కూర్చొని ఉండగా తనపై దాడి చేశారని, స్థానికులు తనను చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

శృంగవరపుకోట రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చామాపల్లికి చెందిన యువకుడి హత్య కేసులో నిందితుడిని ఎస్.కోట సీఐ నారాయణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. ఈనెల 7న మండలంలోని చామాలపల్లిలో తోత్తడి ప్రసాద్‌ను అదే గ్రామానికి చెందిన నడుపూరి మురళీ కత్తితో మెడ నరికి చంపాడని మృతుడి సోదరుడు బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. హత్య జరిగిన రోజున ముద్దాయి గ్రామం నుంచి హత్యకు ఉపయోగించిన కత్తితో తన ద్విచక్ర వాహనంపై పరారయ్యాడన్నారు. గురువారం సదరు నిందితుడు మోటార్ సైకిల్‌పై విశాఖ పారిపోతున్నాడనే కచ్చితమైన సమాచారంతో పోతనాపల్లి జంక్షన్ వద్ద అరెస్టు చేశామన్నారు. అతడి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ హత్యకు అక్రమ సంబంధం అనుమానంతో మురళీ.. కత్తితో ప్రసాద్‌ను నరికి చంపాడన్నారు. తదుపరి విచారణ చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

శాంతినివాస్ ఆశ్రమం పరిశీలన



ఆశ్రమాన్ని పరిశీలిస్తున్న న్యాయాధికారి

బొండపల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒంపల్లిలో గల శాంతినివాస్ అనాథ ఆశ్రమాన్ని శుక్రవారం గజపతినగరం ఫస్ట్‌క్లాస్ మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా అనాథ ఆశ్రమంలో బాలబాలిక వివరాలపై ఆరా తీశారు. అలాగే బాలబాలికలకు ఆశ్రమంలో అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఎదురైతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టండి

నెల్లిమర్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయితీ పరిధిలోని 15, 16 వార్డుల పరిధి తామస్‌పేటలో శుక్రవారం ఉదయం చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కమిషనర్ ఎ.తారక్‌నాథ్ పర్యటించారు. మురుగు కాల్వల వ్యవస్థను మెరుగు పరచాలని, అలాగే వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వారితో పాటు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ డి.ఉమాభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

త్రివిధ దళాల పోరాటానికి సెల్యూట్

● ప్రభుత్వ విప్ జగదీశ్వరి


సెల్యూట్ చేస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, మే 9 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం వీరోచితంగా పోరాటం చేస్తున్న త్రివిధ దళాలకు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సెల్యూట్ చేశారు. శుక్రవారం గుమ్మలక్ష్మీపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ దేశానికి రక్షణ కల్పిస్తున్న ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ దళాలకు పాదాభివందనం చేస్తున్నామన్నారు. శత్రువులకు ధీటుగా ఎదుర్కొని సమాధానమిస్తున్న సైనికులకు దేశ ప్రజలు మద్దతుగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, నాయకులు మరడాన తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఐదు వేల ఎకరాల్లో కొబ్బరి మొక్కల పెంపకం

(5వ పేజీ తరువాయి)

గ్రామైక్య సంఘాలకు అప్పగించున్నారు. ఈ మేరకు గ్రామస్థాయిలో వీవోలను ఎంపిక చేయనున్నారు. ఇప్పటికే సీతంపేట క్లస్టర్ పరిధిలోని ఐదు మండలాల్లో కొబ్బరి మొక్కలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

ప్రతిపాదనలు సిద్ధం

జిల్లా పరిధిలోని పలు గ్రామాల్లో కొబ్బరి మొక్కలు పెంపకానికి ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయి. చెరువులు, ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేయనున్నాం. 300 మీటర్ల మేర ఉన్న చెరువులను గుర్తించాం. మండలాల పరిధిలో చెరువులను గుర్తించే బాధ్యత ఏపీవోలకు అప్పగించాం. క్లస్టర్ పరిధిలోని ఏపీవోలకు అవసరమైన సూచనలు చేశాం. సమాచార సేకరణ పూర్తయింది. మండలంలో ఐదు వేలకు పైగా మొక్కలు కేటాయించనున్నాం. ఉపాధి సాఫ్ట్‌వేర్‌లో పొందుపర్చేందుకు చర్యలు చేపడుతున్నాం. అనుమతులు రాగానే కార్యక్రమం ప్రారంభమ వుతుంది. నిర్వహణలో లోపాలు ఉన్నట్లయితే సంబంధిత ఉపాధి సిబ్బందిపై క్రమ శిక్షణ చర్యలు చేపడతాం.

- కె.రామచంద్రరావు, పీడీ, డ్వామా

గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలి

భామిని, మే 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలని భామిని, బత్తిలి, బాలేరు పీహెచ్‌సీ వైద్యాధికారులు సూచించారు. మండలంలోని పీఎంఎస్‌ఎంఎ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 136 మంది గర్భిణులకు రక్త పరీక్షలు, బీపీ తనిఖీలు చేసి మందులు అందించారు. బత్తిలి పీహెచ్‌సీలో నిమ్మల శుభశ్రీ నాలుగు కేజీల మగబిడ్డను ప్రసవం చేసినట్టు వైద్యాధికారి దామోదర్ తెలిపారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారన్నారు. బాలేరులో 47 మంది గర్భిణులకు వైద్యాధికారి శివకుమార్ వైద్య పరీక్షలు చేయగా సత్యసాయిబాబా సేవా సంఘం ఆధ్వర్యంలో భోజనాలు అందించారు. భామిని వైద్యాధికారిణి వి.సంతోషిలక్ష్మి, సోయల్ ఆధ్వర్యంలో 33 మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందిస్తూ ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పర్యవేక్షణ చేయాలన్నారు.

డ్యూటీ చార్టులు వేయకపోతే ఆందోళనకు సిద్ధపడాలి

● ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి


మాట్లాడుతున్న పలిశెట్టి

పాలకొండ, మే 9 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ఆర్టీసీ డిపోలో డ్యూటీ చార్టులు వేయకపోతే ఆందోళనకు సిద్ధపడాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో డిపో ముఖ్య కార్యక ర్తలతో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన పదోన్నతుల కోసం, పెండింగ్ బకాయిల కోసం, కొత్త బస్సు లు కొనుగోలు, సిబ్బంది రిక్రూట్‌మెంట్ చేయా లని, సిబ్బందికి తలెత్తుతున్న పలు సమ స్యల పరిష్కారం కోసం నిరంతరం ఈయూ రాష్ట్ర కమిటీ కృషి చేస్తుంద న్నారు. జోనల్ కార్యదర్శి భాసూరు కృష్ణమూర్తి మాట్లాడుతూ డ్యూటీ చార్టుల సమస్యను వెంటనే పరిష్కరించకపోతే విజయనగరం జోన్ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఈయూ నాయకులు ఎం.శ్రీనివాసరావు పి.సుందరరావు, డి.దుర్గారావు, సాగర్, నాయుడు, కుమార్, రమణ పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

వీరఘట్టం, మే 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె.లలితకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో జీవనోపాధుల తయారీపై నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. ప్రతి ఇంటిలోనూ మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలన్నారు. వీవోఏలకు, సంఘ సభ్యులకు వార్షిక జీవనోపాధుల తయారీపై అవగాహన కల్పించారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె.లలి తకుమారి, ఏపీఎం కె.రాము, ఈసీ సభ్యులు, ఎంఎస్ సిబ్బంది, వీవోఏలు పాల్గొన్నారు.

సబ్‌జైలులో పాత సామగ్రి వేలం

పాలకొండ, మే 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌జైలులో కొన్ని సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్న సామగ్రిని శుక్రవారం వేలం వేశారు. జిల్లా జైళ్ల శాఖాధికారి మోహన్‌రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింధూర్ యుద్ధ వాతావరణం దృష్ట్యా ముడి సరుకులకు డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున జైల్లో నిత్యావసర సామగ్రిని ఉంచుకోవాలన్నారు. అనంతరం సబ్‌జైలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ బి.జోగులు, హెడ్‌వార్డర్ పి.చంద్రరావు, ఏఎస్ఐ శ్రీనివాసరావు, డీపీటీ నాయుడు, హేమసుందరరావు, సత్యారావు పాల్గొన్నారు.

విరివిగా రక్తదానం చేయాలి

పాలకొండ, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్ యుద్ధ వాతావరణం దృష్ట్యా అధిక మొత్తంలో రక్తనిల్వలు అవసరం ఉంటుందని పాలకొండ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ బీవీ శివ ప్రకాష్ పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానికంగా ఉండే యువజన సంఘాలు, వలంటరీ గ్రూప్‌లు, యువకులు రక్తదానం చేయాలని కోరారు.

నల్లబెల్లం సీజ్

సీతంపేట రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): సీతంపేట గ్రామంలో అక్రమంగా నల్లబెల్లం నిల్వ ఉంచిన గొడౌన్‌పై స్టేట్ టాస్క్‌ఫోర్స్ బృందం శుక్రవారం దాడులు నిర్వహించింది. ఎస్‌టీఎఫ్ సీఐ మురళీధర్, ఎస్ఐ హనుమానునాయుడు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 200 క్వింటాల నల్లబెల్లాన్ని సీజ్ చేశారు. నల్లబెల్లం విక్రయిస్తు న్న బుడ్డి నాగేశ్వరరా వును అదుపులోకి తీసుకున్నారు. సారా తయారీకి వినియోగించే నల్లబెల్లాన్ని నిల్వ చేయడం, విక్రయించడం నేరమని ఎస్‌టీఎఫ్ సీఐ తెలిపారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

● క్యాంపు కార్యాలయాల్లో వినతిపత్రాలు స్వీకరించిన ఎమ్మెల్యేలు


పార్వతీపురం రూరల్: అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర


బొబ్బిలి రూరల్: అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

గుమ్మలక్ష్మీపురం, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్య ల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ప్రభు త్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే పాల్గొని, ప్రజల నుంచి వినతులు స్వీకరించా రు. ఈ కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, నాయకులు మరడాన తవిటినాయుడు, రామారావు, చిన్న, సుబ్బ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

● పార్వతీపురం రూరల్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే విజయచంద్ర చెప్పారు. మండలంలోని నర్సిపురం గ్రామంలో ఉన్న తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. పలువురి నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఉన్న గ్రామాల్లో ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో సీసీ రోడ్లు, కాలువలు, బీటీ రోడ్లు తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి కృషి

బొబ్బిలి రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. బొబ్బిలిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. పలువురి నుంచి వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశాలి చ్చారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని రోడ్లు అభివృద్ధికి గతంలో మంజూరైన నిధులపై ఆర్అండ్‌బీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పినపెంకి, ఆకులకట్ట గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణానికి రూ.2.90 కోట్లు మంజూరైనట్టు అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అమరావతి వెళ్లినప్పుడు ఆర్అండ్‌బీ శాఖ మంత్రిని కలిసి, వీలైనంత త్వరగా నిధులు విడుదలయ్యే ప్రయత్నం చేస్తానని తెలిపారు.

ఎస్‌జీటీ అభ్యర్థులకు ఆన్‌లైన్ శిక్షణ

పార్వతీపురం, మే 9 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో ఎస్‌జీటీ పరీక్ష రాయబోయే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిత అధికారి ఇ.అప్పన్న తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టెట్ పరీక్ష ఉత్తీర్ణులై ఎస్‌జీటీ పరీక్షకు అర్హులైన వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్సులు, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు రెండు దరఖాస్తుతో జత చేయాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను పార్వతీపురంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి కార్యాలయంలో పనివేళల్లో సమర్పించాలన్నారు.

సమయపాలన పాటించాలి

బొబ్బిలి రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే సమయపాలన పాటించాలని డీఎల్‌డీవో ఎం.కిరణ్‌కుమార్ సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలోని పారాది, మెట్టవలస గ్రామాల్లో గల సచివాలయాలను ఆయన శుక్రవారం సందర్శించారు. సిబ్బంది హాజరు పట్టీని తనిఖీ చేశారు. రేషన్ కార్డుల రిజిస్ట్రేషన్లపై ఆరా తీశారు. ఆయన వెంట ఎంపీడీవో పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఉప కేంద్రం పరిశీలన

పారాది గ్రామంలో గల వైద్య ఉప కేంద్రాన్ని డీఎల్‌డీవో ఎం.కిరణ్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. సిబ్బందితో మాట్లాడి, వైద్య సేవలపై ఆరా తీశారు. ఎంపీడీవో పి.రవికుమార్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

రామభద్రపురం, మే 9(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలకు ప్రోత్సహించినా, చేసినా చట్టరీత్యా నేరమని ఎంపీడీవో రత్నం తెలిపారు. శుక్రవారం కొట్టక్కి గ్రామంలో బాల్య వివాహానికి పాల్పడుతున్న కుటుంబానికి ఆమె కౌన్సిలింగ్ ఇచ్చారు. 18 సంవత్సరాలలోపు ఆడపిల్లలకు వివాహాలు చేస్తే పోలీసు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ రాజ్యలక్ష్మి, ఎస్ఐ వెలమల ప్రసాదరావు, సర్పంచ్ అప్పికొండ అనూరాధ, పంచాయతీ కార్యదర్శి ఆకుల ప్రవీణ్‌కుమార్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

రాయితీపై జీలుగ, కట్టె విత్తనాలు

రామభద్రపురం, మే 9(ఆంధ్రజ్యోతి): రానున్న ఖరీఫ్ సీజన్‌కుగాను జీలుగ, కట్టె విత్తనాలను రాయితీపై సరఫరా చేస్తున్నామని మండల వ్యవసాయ అధికారి వి.వెంకటయ్య తెలిపారు. మండల వ్యవసాయ కార్యాలయంలో ఆయన శుక్రవారం మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో జీలుగ, కట్టె విత్తనాలు సాగు చేయడం ద్వారా భూములు సన్నద్ధం చేసుకోవచ్చునని సూచించారు.

● ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతన్న నేస్తం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పెట్టుబడి సాయంపై వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. మండలంలో సుమారు 14 వేల మంది ఈ పథకానికి అర్హులుగా గుర్తించారని తెలిపారు. దీనిపై ఇప్పటికే గ్రామాలవారీగా జాబితాలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సునీత పాల్గొన్నారు.

జీలుగ కల్లుతో అనారోగ్య సమస్యలు

బొబ్బిలి రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపల్ పారిశుధ్య కార్మికులు జీలుగ కల్లు తాగి అనారోగ్య సమస్యలు కొనితెచ్చుకుంటున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు అన్నారు. ఈమేరకు శుక్రవారం రాత్రి ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు ఆధ్వర్యంలో స్థానిక పాకీ వీధిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీలుగ కల్లు ఎవరు అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

బొబ్బిలి చేరుకున్న 'ప్రేమ ప్రవాహిని'



కోలాటం ఆడుతున్న చిన్నారులు, రథానికి హారతి ఇస్తున్న డీఎస్పీ భవ్యరెడ్డి

బొబ్బిలి/ రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పుట్టపర్తి నుంచి ప్రారంభమైన సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథం శుక్రవారం బొబ్బిలి చేరుకుంది. మండలంలోని పురిడి గ్రామం మీదుగా బొబ్బిలి చేరుకుంది. పురిడిలో బాలికలు కోలాటంతో ఘన స్వాగతం పలికారు. బొబ్బిలి చేరుకున్న రథానికి సత్యసాయి యువత బైక్ ర్యాలీతో ఆహ్వానించారు. డీఎస్పీ భవ్యరెడ్డి కొబ్బరికాయ కొట్టి రథ యాత్రకు స్వాగతం పలికారు. చిన్నారులు కోలాటం ఆడారు. ఈ రథ యాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యామిత్ర కిట్ల పంపిణీ భారం తగ్గించండి

మెరకముడిదాం, మే 9(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లుగా పనిచేస్తున్న వారిని విద్యామిత్ర కిట్ల పంపిణీ బాధ్యతల నుంచి పనిభారం తగ్గించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాయుడు, స్టేట్ అసోసియేట్ అధ్యక్షుడు ఆల్తి రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం చల్లాపురంలో సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లును విద్యామిత్ర కిట్ల పంపిణీలో సూపర్‌వైజర్లుగా మాత్రమే వినియోగించాలన్నారు. వారికి ఇచ్చే గౌరవ వేతనాన్ని పెంచాలన్నారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్.పైడిరాజు, మెరకముడిదాం మండల అధ్యక్షుడు ఆర్.సింహాద్రి, ఆల్తి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

12న మెగా జాబ్‌మేళా

గజపతినగరం, మే9 (ఆంధ్రజ్యోతి: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఈనెల 12న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, ఏదైనా పీజీల్లో ఉత్తీర్ణత సాధించిన 18 నుంచి 35 ఏళ్లలోపు యువకులు మేళాకు హాజరుకావచ్చన్నారు. మేళాకు 35 బహుళజాతి కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. ఆసిక్తగలవారు ముందుగా వెబ్‌సైట్‌లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అధికారులకు సమ్మె నోటీసులు

గజపతినగరం, మే9 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొనేందుకు అధికారులకు సమ్మె నోటీసులు అందజేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో, గ్రామ సచివాలయాల్లో అధికారులకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కనకరాజు, కోటేశ్వరరావు, గోవింద, కృష్ణ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు


కారాడ చెరువు వద్ద వాలిపోయిన విద్యుత్ స్తంభాలు

బొబ్బిలి రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారాడ గ్రామం శివారున ఉన్న చెరువుకు ఆవల పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా వాలిపోయి ఉన్నాయి. చాలా కాలంగా ఈ స్తంభాలు ఇలా వాలిపోయి ఉన్నా, సంబంధిత విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లేక ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇటీవల కురిసిన వర్షాలు, ఈదురు గాలుల కారణంగా ఇప్పుడవి కూలిపోయే స్థితికి వచ్చాయి. ప్రమాదం జరగకముందే వాటిని సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఎన్నో సార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. ● ఈ విషయంపై ఏఈ సాంబశివరావును వివరణ కోరగా క్షేత్రస్థాయిలో పరిశీలించి సరిచేస్తామని తెలిపారు.

పారాలీగల్ వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

రాజాం రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): పారాలీగల్ వలంటీర్ల నియామకాలకు ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ ఓ ప్రకటనలో కోరారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన పదో తరగతి అర్హత గలవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యులు, న్యాయ విద్యార్థులు, సేవాదృక్పథం కలిగిన రాజకీయేతర వ్యక్తులు, మైత్రి, స్వయంశక్తి సంఘాల సభ్యులు, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్‌జెండర్స్ ఇందుకు అర్హులన్నారు. ఈనెల 14లోగా న్యాయస్థాన సముదాయ ప్రాంగణంలో సంప్రదించాలని సూచించారు. పారాలీగల్ వలంటీర్లుగా నియమితులైన వారికి జీతభత్యాలు, పారితోషికం ఉండవని న్యాయాధికారి శారదాంబ పేర్కొన్నారు.

వైద్య సేవల్లో నర్సుల పాత్ర కీలకం

● ఘనంగా వారోత్సవాలు ● ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి నివాళి


ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

కురుపాం, మే 9(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రులతో పాటు క్షేత్రస్థాయిలో వైద్య సేవలు అందించడంలో నర్సులు కీలక పాత్ర పోషిస్తున్నారని స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శోభారాణి అన్నారు. ఈనెల 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక సీహెచ్‌సీలో హెడ్ నర్సు జి.ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఈసందర్భంగా నైటింగేల్ ఆశయ సాధనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

సీతానగరం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మండల ప్రత్యేకాధికారిణి రాజేశ్వరి తెలిపారు. శుక్రవారం ఆమె గుచ్చిమి హౌసింగ్ కాలనీలో ఇన్‌చార్జి ఎంపీడీవో కె.కుమార్‌వర్మ, ఇతర శాఖల అధికారులతో కలిసి గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈసందర్భంగా కాలనీలో గృహాల లబ్ధిదారులతో మాట్లాడారు. లబ్ధిదారులకు మంజూరు చేసే అదనపు ఆర్థిక సహాయంతో మే నెలాఖరు నాటికి గృహాలను పూర్తి చేయాలన్నారు. పూర్తి చేసిన వాటికి బిల్లులు చెల్లించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. హౌసింగ్ ఏఈ జానకీరాం ఆధ్వర్యంలో కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. అనంతరం కాలనీలో రోడ్లు, మౌలిక వసతులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, ప్రీస్కూల్ పిల్లల హాజరు, ఇతర సరుకులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సీనియర్ సహాయకులు సన్యాసిరావు, గృహ నిర్మాణ సంస్థ సిబ్బంది, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

● మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం, మే 9 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర స్త్రీ శిశు, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలోని ఐటీడీఏల ప్రాజెక్టు అధికారులతో ఇతర లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో కలిసి శుక్రవారం విజయవాడలో సమీక్షా సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. రూ.156 కోట్లతో ప్రారంభించిన గిరిజన ప్రాంత పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని మంత్రి లోకేశ్ సమావేశంలో అధికారులను ఆదేశించారని ఆమె చెప్పారు. అలాగే గిరిజనులకు మంచి వైద్యం అందేలా ప్రణాళికలు రూపొందించాలని లోకేశ్ ఆదేశించారని తెలిపారు. జీవో నెం-3ను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఆలోచనలో ఉందని మంత్రి చెప్పారు. డోలీల మోత లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని ఆమె తెలిపారు.

న్యూస్ బాక్స్

తీర్థయాత్రలకు వెళ్లొద్దు

బొబ్బిలి రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఉన్న అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో విహారయాత్రలకు, తీర్థయాత్రలకు వెళ్లడం శ్రేయస్కరం కాదని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విహార యాత్రలకు, తీర్థయాత్రల కు వెళ్తే ప్రజల రక్షణ సైన్యానికి మరింత భారం అవుతుందని అన్నారు. విహార యాత్రలను వాయిదా వేసుకోవాలని ఆయన కోరారు.

నేడు టీడీపీ సమావేశం

గరుగుబిల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల స్థాయి విస్తృత సమావేశాన్ని ఉల్లిభద్ర ప్రాంతంలో శనివారం నిర్వహించనున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు ఎ.మధుసూదనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆరేటి మహేష్‌బాబు హాజరవుతున్నారని చెప్పారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ ప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

సారా స్వాధీనం

కురుపాం, మే 9(ఆంధ్రజ్యోతి): చినమేరంగిలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 80 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. అక్రమంగా సారా అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని, వారి వద్ద నుంచి 80 లీటర్లు సారాతో పాటు బైకును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆధార్ శిబిరాలు

బొబ్బిలి రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తామని ఎంపీడీవో పి.రవి కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12, 13వ తేదీలలో జగన్నాథపురం, దిబ్బగుడ్డివలస గ్రామ సచివాలయంలో, 14, 15 తేదీలలో చింతాడ, సీహెచ్ బొడ్డవలస సచివాలయంలో శిబిరాలు నిర్వహిస్తారని చెప్పారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

మక్కువ, మే 9 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి బి.శ్యామల అన్నారు. పనసభద్ర పంచాయతీ మూలవలస గ్రామంలో గృహ నిర్మాణాలను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్దేశించిన గడువులోగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. అనంతరం దుగ్గేరులో ఫాంపాండ్లను పరిశీలించారు. ఉపాధి కూలీలకు ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టెంట్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఏపీవో ఎస్.ఈశ్వరమ్మ, మండల ఉద్యానవన శాఖాధికారి ప్రత్యూష, ఉపాధి, గృహ నిర్మాణ సిబ్బంది పాల్గొన్నారు.